క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం పురస్కరించుకుని ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

భూముల రీ సర్వేపై అవగాహన

నందికొట్కూరు: జగనన్న భూహక్కు- భూరక్ష రీ సర్వే గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాలమద్దయ్య, ఆర్వో విజయలక్ష్మి, వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు, అడ్మిన్లకు సీడీఎంఏ ఆఫీస్ జీఐఎస్ ఎక్స్‌పర్ట్ సాయి వర్మ, చిన్నరాజు మంగళవారం శిక్షణ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రీ సర్వే ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా న్యాయంగా రీ సర్వే చేయాలని సూచించారు.

చెరఖా కాలనీలో వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: కరివేన మజరా గ్రామమైన చెరఖా కాలనీలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి రోగులకు షుగర్, క్షయ, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ ,షుగర్ ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లత,భాస్కర్, రవి, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

6న బండలాగుడు పోటీలు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో శ్రీసుంకులా పరమేశ్వరి దేవాలయ ప్రతిష్ఠ సందర్భంగా జూన్ 6న ఆరుపండ్ల విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.30,000 దాత జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి, రెండవ బహుమతి రూ.20,000 దాత పోలయ్య బ్రదర్స్, 3వ బహుమతి రూ.15,000 ,4వ బహుమతి రూ.10,000 దాత చంద్రశేఖరరెడ్డి, 5వ బహుమతి రూ.5000, 6వ బహుమతి రూ.4000 దాత ఉబేదుర్ రహిమాన్ అందజేస్తారన్నారు. శ్రీనివాసులు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9959660100, 9603844356 నెంబర్లను సంప్రదించాలని వివరించారు.

నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి

కొత్తపల్లి: జగనన్న కాలనీల్లో గృహాలను లబ్ధిదారులు నాణ్యతగా నిర్మించుకోవాలని జగనన్న ఇళ్లస్థలాల మండల కో–ఆర్డీనేటర్ గనమల పరశురాముడు సూచించారు. మంగళవారం స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపేదవారికి పక్కాగృహం ఉండాలన్న సంకల్పంతో ఇంటిస్థలం ఇచ్చి సబ్సిడీపై ఇసుక, సిమెంట్ ఇతరత్ర సమగ్రి అందిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగ ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న సర్పంచ్ అఖ్తరున్నిసా

పాములపాడు: టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ అఖ్తరున్నిసా అన్నారు. మంగళవారం మండలంలోని మద్దూరు గ్రామం సచివాలయంలో టీబీ ముక్త్ గ్రామ పంచాయత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ మాట్లాడుతూ టీబీ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, అపోహలు తొలగిపోవాలన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, క్షయను గుర్తించేందుకు చేసే పరీక్షల గురించి వివరించారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తామని, అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యశోద, సీహెచ్ఓ రేణుక పాల్గొన్నారు.

సంక్షేమ సంతకానికి నాలుగేళ్లు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం చేసి పేదల సంక్షేమానికి నాంది పలికి నాలుగేళ్లు పూర్తయిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో జగనన్న పాలన సాగుతోందన్నారు. సంక్షేమాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ పరుగులు తీస్తుందని చెప్పారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగనన్న లక్షా 34 వేల సచివాలయాల ఉద్యోగాలిచ్చారు. సచివాలయాల్లో 35 ప్రభుత్వ శాఖలతో 545 సేవలు జగనన్న ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. 2 లక్షల 66 వేల మంది వలంటీర్లను ఇంటి వద్దకే పాలన అందించేందుకు జగనన్న ప్రభుత్వం నియమించిందని గుర్తు చేశారు. చంద్రబాబు ఉచిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేరని స్పష్టం చేశారు.

ఎత్తిపోతల పథకాలకు గ్రీన్ సిగ్నల్

మిడుతూరు, జద్దువారిపల్లె ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నిల్ ఇచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. అలగనూర్ రిజ్వాయర్ నుంచి మిడుతూరు, తంగడంచ, పారుమంచాల చెరువులకు నీరు అందించేందుకు ఫైల్‌పై సీఎం సంతకం చేశారని చెప్పారు. ఇస్కాల బిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి వచ్చిందన్నారు. ఉర్దూ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. 2014 ఎన్నికల సమయంలో రైతులకు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారని గుర్తు చేశారు. గత టీడీపీ పాలనలో బాబు ఒక ఉద్యోగమైన ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య, కౌన్సిలరు జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రాజు, జయభారత్‌రెడ్డి, చిట్టిరెడ్డి, ఇనాయతుల్లా, శంకరయ్య, ప్రవీణ్, శివ, జక్కరయ్య, జాన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన

ఆత్మకూరు: రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి. పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేల కిలో మీటర్లు పాదయాత్ర చేస్తూ.. అందరి కష్టాలను తెలుసుకుని, తాను అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి నవరత్నాలు లాంటి పథకాలు అందజేస్తానని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నేడు ప్రజలకు నవరత్నాలే కాకుండా ఎన్నో పథకాలు అందజేస్తూ ప్రజల మన్ననను పొందుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి సరిగా లేనప్పటికీ అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 40 సంవత్సరాల అనుభవం అంటూ గొప్పలు చెప్పుకోవడం మినహా ప్రజాప్రతినిధులుగా, ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది లేదన్నారు. అతని కొడుకు పప్పును మంత్రిని చేసింది మినహా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పువ్వాడ భాస్కర్, నాగేశ్వరరెడ్డి, విజయచౌదరి, విజయ్, పార్వతి, గౌడ్, శేషిరెడ్డి, సురేష్, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించండి



సంతజూటూరు వద్ద పనులు పరిశీలిస్తున్న పీడీ

మహానంది: గ్రామాల్లో జాబ్ కార్డులు ఉండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆదేశించారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరు, శింగవరం, పెద్దదేవళాపురం గ్రామాల పరిధిలో జరుగుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వేతనం అందేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికి పనులు కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి చేయూత అందించాలన్నారు. అమృత్ సరోవర్ పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధారెడ్డి, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరం వద్ద పటిష్ట భద్రత

కొత్తపల్లి: రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో వద్ద చేపట్టనున్న సిద్ధేశ్వరం జల జాగరణ దీక్షలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఎస్‌ఐ హుస్సేన్‌బాషా తెలిపారు. మంగళవారం సంగమేశ్వరం సమీపంలో సిద్ధేశ్వరం జలజాగరణ దీక్షా స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం జలజాగరణ దీక్షను నిర్వహించు వారు నిబంధనలు ఉల్లంఘించకుండా, ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు, కానిస్టేబుళ్లు ప్రసాద్‌నాయక్, సుదర్శన్, ఎర్రమఠం ఉన్నారు.

మాది చేతల ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి మాటల ప్రభుత్వం కాదు.. మాది చేతల ప్రభుత్వమని నిరూపించారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని చౌట్కూరు గ్రామ సచివాలయ పరిధిలోని గుడిపాడు (చౌట్కూరు మజరా గ్రామం), 49–బన్నూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మల్లికార్జున రిజర్వాయర్‌పై సందేహాలు తొలగించండి

మా ప్రాంతాంలో (దేవనూరు, గుడిపాడు, 49–బన్నూరు) గ్రామాలలో మల్లికార్జున (రిజర్వాయర్) ప్రాజెక్టు మంజూరు అయ్యిందని పత్రికలో వచ్చిందని.. మా పొలాలు పోతాయని, మా ప్రాంతంలో సారవంతమైన విలువైన భూములు ఉన్నాయని.. మాకు ఈ ప్రాజెక్టు వద్దంటూ.. మా ప్రాంతానికి సాగునీందించాలని గుడిపాడు గ్రామస్తులు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మీ అంగీకారం లేనిది మీ పొలాలు ఎక్కడికి పోవని హామీ ఇచ్చినా గ్రామస్తులు వినలేదు. దీంతో కలెక్టర్ అపాయింట్ తీసుకొని మీ సందేహాలను నివృత్తి చేస్తామనడంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో చౌట్కూరు సర్పంచ్ మదార్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటీ గోవర్ధన్‌రెడ్డి, కమతం వీరారెడ్డి, ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, నాయకులు మహేష్, ఇనాయతుల్లా, సీతారాముడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



అవార్డులు పొందిన గువ్వలకుంట్ల వలంటీర్లు

మిడుతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని వీపనగండ్ల సర్పంచ్ భారతి, ఎంపీటీసీ హరిసర్వోత్తమరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వీపనగండ్ల, జలకనూరు గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లకు దుశ్శాలువాలు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. జలకనూరు సర్పంచ్ ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామాలలో వలంటీర్లు సేవాగుణంతో పని చేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయంలో సర్పంచు మశమ్మ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చాందిని, వీఆర్వో కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సోమల స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అర్లపాడు ఘాట్ ఆకస్మిక తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

పగిడ్యాల: కృష్ణానదిలో ఇంజిన్ బోటు ప్రయాణంపై నిషేధం కొనసాగుతున్నా అర్లపాడు ఘాట్ నిర్వాహకులు యథేచ్ఛగా బోటు ప్రయాణాన్ని నిర్వహిస్తున్న వైనాన్ని ఈనెల 27న తేదీన 'నిషేధాన్ని నదిలో వదిలేశారు' అనే శీర్షికన సాక్షి దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. ఈ మేరకు ఘాట్‌ను సందర్శించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో మంగళవారం నెహ్రూనగర్ వీఆర్వో వెంకటస్వామి అర్లపాడు ఘాట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఘాట్ వద్ద ప్రయాణికులను నది దాటించడం గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రయాణంపై నిషేధం తమకు వర్తించదని తెలంగాణ రాష్ట్రం చెల్లపాడు గ్రామ ఘాట్ నిర్వాహకులు బాలకృష్ణ, ధర్మ, వీఆర్వోతో వాగ్వాదానికి దిగారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని అవసరమైతే మా పోలీసులతో మాట్లాడండని బోటును తిప్పకుండా అడ్డుకునే హక్కు లేదని ఎదురుదాడికి దిగడం విశేషం. సమస్య తీవ్రం కావడంతో వీఆర్వో వెంటనే ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జునకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.



వీఆర్వో వాగ్వాదానికి దిగిన తెలంగాణ బోటు నిర్వాహకులు ధర్మ, బాలకృష్ణ

ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు అర్హులైన స్త్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్య తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని 17వ కేంద్రంలో ఒకటి (బీసీ–డి), బండిఆత్మకూరు మండలం బోధనంలో ఒకటి (బీసీ–బి), మహానంది మండలం మసీదు పురంలో ఒక పోస్టు ఈడబ్ల్యూఎస్‌కు కేటాయించినట్లు చెప్పారు. ఆయా పోస్టులకు 10వ తరగతి తప్పనిసరిగా పాస్ అయి ఉండాలని చెప్పారు. వయస్సు 21 నుంచి 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ నెల 30 నుంచి వచ్చే నెల జూన్ 4 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని కోరారు.

నందికొట్కూరు: నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం–3లో ఆయా పోస్టుకు బీసీ–బీకి, మిడుతూరు మండలంలోని సున్నపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు బీసీ–డీకి చెందినవారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ తెలిపారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

ఆత్మకూరు: ఐఖ్యపోరాటాల ద్వారానే హక్కు లు సాధించడం సాధ్యమవుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భావం నుంచి కార్మికుల పక్షాన నిలిచి ఉద్యోగ, కార్మిక సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రణధీర్, రజాక్, రామ్‌నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

పాములపాడు: స్థానిక సీఐటీయు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం మండల కార్యదర్శి పరమేష్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు హనుమంతు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్మికులు కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నాగసైదయ్య , చిన్న మారెన్న , నాగరాజు, ఎమ్ మల్లికార్జున , నాగవెంకటేష్ ,జి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

- శ్రీశైలం నియోజకవర్గంలో రూ. 26.80లక్షలు చెక్కులు పంపిణీ
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



.బాధితులకు చెక్కులను అందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిది అని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది, ఆత్మకూరు, శ్రీశైలం మండలాలకు సంబంధించిన బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 26.80లక్షల చెక్కులను నంద్యాలలోని ఎమ్మెల్యే శిల్పా నివాసంలో అందించారు. అలాగే శ్రీశైలం మండలంలో లింగాలగట్టులో ప్రమాదవశాత్తు కాలిపోయిన బోట్లకు నష్టపరిహారంగా ముగ్గురికి రూ. 6లక్షలు మంజూరు కాగా చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలం కురుకుందలో కరెంటు షాక్‌తో చనిపోయిన నసీకా కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు, వెలుగోడు మండలంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రబ్బానీ కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు వచ్చాయని తెలిపారు. బండి ఆత్మకూరు మండలం ఏకోడూరుకు చెందిన నూర్‌బాషా రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా రూ. 2లక్షలు వచ్చిందన్నారు. మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన నర్ల హరినాథ్‌రెడ్డి పొలంలో పనిచేస్తుండగా విద్యుత్ తీగ తెగి మీదపడటంతో చేయి తీసేశారని, ఆయనకు రూ. 5లక్షలు మంజూరైందన్నారు. గోపవరం గ్రామానికి చెందిన చెవుల సరస్వతి భర్త శ్రీనివాసులు మృతి చెందడంతో రూ. 2లక్షలు, ఈతకు వెళ్లి కుంటలో పడి మృతి చెందిన విజయ్ కుటుంబ సభ్యులకు రూ. 2లక్షలు, బుక్కాపురం గ్రామానికి చెందిన ఎర్రగుంట్ల మౌలాలయ్య కరెంట్ షాక్‌తో చనిపోయిన ఘటనలో ఆయన భార్య లక్ష్మీకి రెండు లక్షలు మంజూరైనట్లు తెలిపారు. దీంతో మొత్తం రూ. 26,80, 000 వచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ చిన్నసంజీవరెడ్డి, సర్పంచ్ లక్ష్మీరెడ్డి, మదాసి కురువ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ గజ్జా పెద్దపక్కీరయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, పుల్లయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణాభివృద్ధే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి చేసేందుకు వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర 19 అభివృద్ధి అంశాలపై సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మాణాలను ఆమోదించామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వెదుర్ల అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల ఆగ్రహం!

మహానంది: మహానంది మండలంలోని మహానంది, బసవాపురం, చలమ, తదితర గ్రామాల్లో వెదుర్లు, పట్టుడుకర్రల అక్రమ రవాణా జోరుగా జరుగుతున్నట్లు మంగళవారం సోషల్‌మీడియాలో రావడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మహానందిలో వెదుర్ల రవాణాకు సంబంధించి రెండు వర్గాల మధ్య ఘర్షణలు సైతం చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. నల్లమ పరిసర గ్రామాల్లో నిత్యం పట్టుడుకర్రలు, వెదుర్లు తరలివెళ్తున్నా అటవీశాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహానంది సమీపంలోని గాజులపల్లె రైల్వేస్టేషన్‌లోని అటవీశాఖ డిపో నుంచి ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న వెదుర్ల రవాణాపై అటవీశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

సీహెచ్‌సీ తనిఖీ

వెలుగోడు: స్థానిక సీహెచ్‌సీని జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ జహ్రుల్లా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులు పరిశీలించి, ఓపీ వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. అలాగే నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది వేళలు పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆత్మకూరు: పట్టణంలోని అంజుమన్ కమిటీ కార్యాలయానికి ఇద్దరు వ్యక్తులు తాళం వేసినందుకు అంజుమన్ కమిటీ కార్యదర్శి రఫిక్ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సుబాని , అతని అన్న పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపారు.

ఆధ్యాత్మికం

వైభవంగా చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవాలు



బండిఆత్మకూరులో జ్యోతులను ఊరేగిస్తున్న దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు గ్రామంలో కొలువైన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం అర్ధ రాత్రి ప్రారంభమైన జ్యోతుల ఊరేగింపు మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. కులమతాలకు అతీతంగా అందరూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అమ్మవారిని గంధం, చందం, పసుపు, కుంకుమలతో అలంకరించి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు పదిహేనళ్ల తర్వాత అమ్మవారి జ్యోతి మహోత్సవాలు జరగడంతో గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ బంధుమిత్రులను పిలుచుకుని పండుగను నిర్వహించుకున్నారు. విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆత్మీయంగా కలిసిమెలిసి మాట్లాడుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు శిల్పా భువనేశ్వరరెడ్డిలు ఉత్సవాలకు హాజరయ్యారు. ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ సంధ్య, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ సుజాతమ్మ, చిన్న సుబ్బారెడ్డి(బాబురెడ్డి), దీపుకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని శ్రీసుంకులాపరమేశ్వరీ అమ్మవారికి మంగళవారం గ్రామస్తులు సామూహికంగా బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం నిర్వహించి కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం గుమ్మడికాయను బలిహారతిగా నిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు వేపరమ్మలతో బోనాలను నెత్తిన పెట్టుకొని మేళతాళాలతో వందలాదిగా తరలివచ్చి అమ్మవారికి సామూహికంగా బోనాలు సమర్పించారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎన్‌సీసీ అధికారి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఎన్‌సీసీ 28 (ఏ) బెటాలియన్ ప్రత్యేకాధికారి అక్షంమాథుర్ సందర్శించారు. శ్రీశైలం డిగ్రీ కళాశాలలో 2022 వ సంవత్సరంలో ఎన్‌సీసీ యూనిట్ మొదటి బ్యాచ్‌ను ప్రారంభించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, ఎంపిక విధానాన్ని ఎన్‌సీసీ అధికారి అధ్యాపకులతో చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్ మహేశ్వరరెడ్డి, అధ్యాపకులు ఎస్ సుబ్రహ్మణ్యం శర్మ, ఎస్‌కే షాహీద, ఎన్‌సీసీ టీమ్ లీడర్ పి.వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ మంత్రులు



మల్లన్న దర్శనార్థం వెళ్తున్న మంత్రి హరీష్‌రావు,



ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మంత్రి నిరంజన్‌రెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్.లవన్న, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, అందజేసి సత్కరించారు.

సేవా కార్యక్రమాల్లోనూ అగ్రగణ్యులు ఆర్యవైశ్యులు

శ్రీశైలం: ఆర్యవైశ్యులు వర్తకంలోనే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలోనూ అగ్రస్థానంలో ఉన్నారని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. స్వామి అమ్మవార్ల దర్శనంతరం ఆయన పాతాళగంగ రోడ్డు మార్గంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించారు. యాత్రికుల వసతి సౌకర్యార్థం 142 గదులను నిర్మించేందుకు దేవస్థానం వారు అందిస్తున్న సహాయ సహకారాన్ని కొనియాడారు. అనంతరం సత్ర కార్యవర్గ కమిటీ, సత్రంలో గదులు నిర్మించిన దాతలు మంత్రి హరీష్‌రావును ఘనంగా సత్కరించారు.